ప్రజాశక్తి
మంగళవారం 20 మే 2025
5
పార్వతీపురం మన్యం

21 నుంచి యోగా మాసోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

యోగా మాసోత్సవంను ఈనెల 21 నుండి నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆదేశించారు. వివిధ అంశాల పట్ల జిల్లా కలెక్టర్లుతో ప్రధాన కార్యదర్శి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 21 నుండి జూన్ 21 వరకు యోగా మాసోత్సవం జరుగుతుందన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన ఆదేశించారు. గ్రామ, మండల స్థాయి నుంచి కార్యక్రమం చేయాలని ఆయన అన్నారు. యోగా మాసోత్సవంలో భాగంగా వివిధ స్థాయిలలో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలను సన్నద్ధం చేయాలని ఆయన అన్నారు.

కోలాహలంగా తొలేళ్ల ఉత్సవం

కిక్కిరిసిన సాలూరు పట్టణం
కిలోమీటరు మేర జనసందోహం
నేటి సిరిమానోత్సవానికి సర్వం సిద్ధం

ప్రజాశక్తి- సాలూరు/రూరల్

సాలూరు శ్యామలాంబ పండుగలో భాగంగా సోమవారం నిర్వహించిన తొలేళ్ళ ఉత్సవానికి వేలాది సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పట్టణంలో ప్రధాన రహదారి కిలోమీటరు మేర జనసందోహంతో కలకల్లాడింది. అక్కేనవీధి పెద్దలు పాలజంగిడి, పూజతో బయలుదేరి మిగిలిన అన్ని వీధుల వాసులకు అందజేశారు. అమ్మవారి గద్దె ఉన్న పెదకోమటి పేట వరకు అన్ని వీధుల ప్రజలు కర్రలతో వెళ్ళారు. గద్దె వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్ రింగ్‌లో డబ్బివీది, గొల్లి వీధి, మెంటాడవీధి వాసులు సాము తిప్పారు. యువరాజు విక్రం చంద్ర సన్యాసిరాజు వచ్చి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలేళ్ళ ఉత్సవం ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం రాత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మక్కువ బైపాస్ రోడ్డు ల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేడు సిరిమానోత్సవం

శ్యామలాంబ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టం మంగళవారం సిరిమానోత్సవం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ చైర్మన్ అఖ్యాన అప్పారావు, పట్టణ పెద్దల సిద్ధమయ్యారు. సిరిమానును అధిరోహించేందుకు పూజారి జన్ని నారాయణరావు సిద్ధమయ్యారు. సిరిమానును తిలకించేందుకు పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, ఇతర జిల్లాల నుంచి భారీగా భక్తులు వస్తారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి : ఇఒ టి.రమేష్

శ్యామలాంబ అమ్మవారి పండగ సందర్భంగా అమ్మవారి ప్రధాన ఆలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భారీ క్యూ లైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఇఒ తెర్లి రమేష్ తెలిపారు. ఉచిత దర్శనం, 20 రూపాయలు, 50 రూపాయలు దర్శనాలను, వి ఐ పి దర్శనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు మంచినీరు, మజ్జిగను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజలంతా సహకరించాలి : సిఐ

అమ్మవారి జాతర సరదాగా జరుపుకోవాలని, ఎటువంటి గొడవలు జరగకుండా ప్రజలు సహకరించాలని పట్టణ సిఐ బి.అప్పలనాయుడు కోరారు. పోలీసులు కూడా వచ్చే భక్తులతో మర్యాదగా ప్రవర్తించి జాతరలో ఎటువంటి సంఘటనలు జరగకుండా సక్రమంగా జరిగేలా ఆదేశాలను ఇచ్చినట్లుతెలిపారు. నిబంధనల గురించి ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించి ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను మళ్లించడానికి ఏర్పాట్లు చేసినట్లు అయన తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా విజయనగరం నుండి వచ్చే బస్సులను సాలూరు బైపాస్ రోడ్డు ద్వారా జీగిరాం నుండి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు, మక్కువ నుండి వచ్చే బస్సులను మక్కువ బైపాస్ రోడ్డు వద్ద మామిడిపల్లి నుండి వచ్చే వాహనాలను నారాయణ స్కూల్ ఆవరణలో పార్కింగ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తొలేళ్ళ ఉత్సవానికి పోటెత్తిన ప్రజలు



పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు : కమిషనర్

పండుగ సందర్భంగా పట్టణ ప్రజలకు 24గంటలు తాగునీటిని సరఫరా చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ డిటివి కృష్ణారావు తెలిపారు. ఇందుకు సిబ్బందిని సిద్ధంగా ఉంచామని, సుమారు 25 మోటార్లను వీధుల్లో తీశామన్నారు. మున్సిపాలిటీలో ఉన్న రెండు ట్యాంకులతో పాటు దాతలు ఇచ్చిన ఐదు వాటర్ ట్యాంకులతో వీధుల్లో మంచినీటి సదుపాయాన్ని కల్పి స్తున్నామని తెలిపారు. తాత్కాలికంగా 50 మరుగుదొడ్లను ఏర్పాటు చేశామని, మున్సిపాలిటీకి ఉన్న 114 మంది పారిశుధ్య కార్మికులతో కలిపి సుమారు బయట మున్సిపాలిటీలు గ్రామపంచాయతీల నుంచి 150 మంది పారిశుద్ధ్య కార్మికులను రప్పించమని తెలిపారు. వీరి ద్వారా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను చేపడుతున్నట్టు తెలిపారు.

నిరంతరం విద్యుత్ సరఫరా

పండగ సందర్భంగా పట్టణంలో 20 వరకు ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా బిగించి 180 స్తంభాలను ఏర్పాటు చేసినట్లు నిరంతరం విద్యుత్తును అందిస్తున్నట్టు ఎలక్ట్రికల్ డిఇ రంగారావు తెలిపారు. విద్యుత్ సిబ్బందితో అప్రమత్తంగా ఉన్నామని ప్రధానంగా సిరిమాను తిరిగే ప్రాంతాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుండి సిరిమాను తిరిగే వరకు ఆయా ప్రాంతాల్లోనే విద్యుత్తును నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరా పై ప్రజల్లో అసంతృప్తి

శ్యామలాంబ గ్రామదేవత పండుగ నేపథ్యంలో పట్టణంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని మంత్రి సంధ్యారాణి ఆదేశించినా ఫలితం కనిపించలేదు. రూ. 2కోట్లతో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, స్తంభాలు,ఇతర సామాగ్రి కొనుగోలు చేశారు. పట్టణమంతా పాత స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు.అయితే పండుగ ముందు నుంచే విద్యుత్ కోతలు అమలు చేయడంతో జనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

తొలేళ్ల ఉత్సవంలో భాగంగా పూజసాము చేస్తున్న అక్కేన వీధి వాసులు

సుందరయ్య చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఆదర్శనీయుడు సుందరయ్య

సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ఆదర్శ రాజకీయ నేత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక సుందరయ్య భవనంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలను సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం జరిగిన సభలో కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శవంతమైన కమ్యూనిస్టుగా పుచ్చలపల్లి సుందరయ్య గుర్తింపు పొందారని కొనియాడారు. స్వాతంత్రోద్యమ కాలంలోనే స్వాతంత్ర పోరాటంతో పాటు ప్రజా, సామాజిక సమస్యలను నిర్దిష్టంగా పరిశీలించి ప్రజా ఉద్యమాలను నిర్మించిన మహోన్నతమైన వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. చిన్ననాటి నుండే కుల వివక్ష, అంటరానితనం, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించిన వ్యక్తని అన్నారు. చారిత్రాత్మకమైన తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపించి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర సుందరయ్య దని గుర్తు చేశారు. దేశ సమగ్రత, సమైక్యతను కాపాడేందుకు మతోన్మాద ప్రమాదాన్ని 70వ దశకంలోనే గుర్తించి మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని ప్రజలకు పిలుపునిచ్చిన దూరదృష్టి కలిగిన రాజకీయ వేత్త సుందరయ్య అని కొనియాడారు. సుందరయ్య ఆశయ సాధనకై ఆయన ఆశయాలతో ప్రజా ఉద్యమాలను నిర్మించాలని కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బివి రమణ, ఆర్.శ్రీదేవి, ప్రజా సంఘాల నాయకులు బంటు దాసు, పాకల సన్యాసిరావు, సంచాన ఉమామహేశ్వరరావు, వి.చిన్నం నాయుడు, బి.లక్ష్మి, ఎం.ఉమామహేశ్వరి, పి.రాము, ఎస్.పోలినాయుడు, సిహెచ్ వెంకటరమణ, జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి

స్కానింగ్ సెంటర్లపై తనిఖీలు : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ డివిజన్ పరిధిలోని స్కానింగ్ కేంద్రాలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన పిదప వివరాలను వెల్లడించడం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి స్కానింగ్ సెంటర్లపైనా, సిబ్బందిపైనా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా సెంటర్ల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం అమలుపై డివిజనల్ స్థాయి సలహా మండలి సమావేశం పిఒ ఛాంబరులో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకొండ డివిజన్ పరిధిలో 11 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, వాటిని ప్రతి మూడు నెలలకోసారి తనిఖీలు చేయాలన్నారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని, సీసీ కెమెరాలు కచ్చితంగా ఉండాలన్నారు. ఫీజుల వివరాలు అందరికీ కనిపించేలా బోర్డులను ప్రదర్శించాలని ఆదేశించారు. ఆడ శిశువుల పట్ల వివక్ష లేకుండా సమాజంలో చైతన్యం తీసుకురావాలని అన్నారు. సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కె.విజయ పార్వతి, సీతంపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.శ్రీనివాసరావు, పాలకొండ ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ కె.చిరంజీవి, గైనికాలజిస్ట్ డాక్టర్ ఆర్.భారతి, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ రవీంద్ర కుమార్, లీగల్ అడ్వైజర్ వై.లక్ష్మునాయుడు, సామాజిక కార్యకర్త పి.బాలరాజు, డెమోలు వై.యోగీశ్వర రెడ్డి, వి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను తక్షణం పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పీజీఆర్ఎస్)లో వచ్చిన సమస్యలను మానవతా దృక్పథంతో ఆలోచన చేసి పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి 108 మంది అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె. హేమలత, కెఆర్ఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ డాక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి భాగస్వామ్యమయ్యారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని, సమస్య పరిష్కారం ఏ దశలో ఉందో సెల్ ఫోన్‌కు మెసేజ్ ద్వారా అర్జీదారునికి తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. కావున అర్జీల పరిష్కార ప్రక్రియలో ఎటువంటి పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి సమస్యకు నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని, అర్జీదారుల సంతృప్తే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. పిజిఆర్ఎస్ నిర్వహణ తీరు పట్ల ప్రజలకు నమ్మకాన్ని పెంపొందించాలని, దీనికి క్షేత్ర స్థాయి అధికారులు నిరంతర సమన్వయం అవసరమని కలెక్టర్ హితవు పలికారు.
కార్యక్రమంలో జిల్లా అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు : ఎస్‌పి

పార్వతీపురం రూరల్ : ప్రజా సమస్యల వేదికలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎస్ వి మాధవ్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఆరు ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డిసిఆర్బీ ఎస్సై ఫక్రుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఐటిడిఎ గ్రీవెన్స్ కు 46 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించారు. పుబ్బాడకు చెందిన కె.పద్మ తమ గ్రామానికి సిసి రోడ్డు మంజూరు చేయాలని, రాజమానుగూడకు చెందిన సవర చిన్నారావు వరద గోడ మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. అలాగే చాపరాయిగూడకు చెందిన సవర నవీన్ 1బి అడంగల్ ఇప్పించాలని, కుంభీ గ్రామానికి చెందిన కూరంగి రామారావు త్రాగునీటి బోరు మంజూరు చేయాలని కోరారు. రాయిమానుగూడకు గ్రామానికి చెందిన సవర దీపిక గ్రామానికి సిసి రోడ్డు మంజూరు చేయాలని త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతిపత్రం సమర్పించారు. మెట్టుగూడకు చెందిన ఆరిక సురేష్ వీధి కాలువలు మంజూరు చేయాలని, అడ్డంగికి చెందిన సవర మంగయ్య పవర్ వీడర్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఇఇ రమాదేవి, డిడి అన్నదొర, పిహెచ్ఒ వెంకట గణేష్, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, డిప్యూటీ డిఇఒ టి.చందర్రావు, వెలుగు ఎపిడి సన్యాసిరావు, సిడిపిఒ పి.రంగలక్ష్మి, ఎఎంఒ కోటి బాబు ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిసిసిలో బదిలీల కుదుపు

మంత్రి, చైర్మన్ సిఫార్సులతోనే...

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సహకార సంస్థ (జిసిసి)లో అధికారులు, ఉద్యోగుల బదిలీల కుదుపు వచ్చింది. సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సిఫార్సు మేరకు మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలతో కొంతమంది అధికారులు, ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరికొంతమంది అధికారులు, ఉద్యోగులు అసంతృప్తికి గురవుతున్నారు. పార్వతీపురం ఇన్‌ఛార్జి డివిజనల్ మేనేజర్‌గా పని చేస్తున్న వి.మహేంద్రకుమార్‌ను వేములవలస సెంట్రల్ గోడౌన్ మేనేజర్‌గా బదిలీ చేశారు. సాలూరు జిసిసి బ్రాంచ్ జూనియర్ మేనేజర్‌గా పని చేస్తున్న జె.రామారావును పార్వతీపురం బ్రాంచ్ జూనియర్ మేనేజర్‌గా బదిలీ చేస్తూ ఇన్‌ఛార్జి డివిజనల్ మేనేజర్ బాధ్యతలు అప్పగించారు. సాలూరు బ్రాంచ్ మేనేజర్‌గా ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్ ఇంఛార్జి విహెచ్.రాములుకు ఉద్యోగోన్నతి కల్పించారు. గుమ్మలక్ష్మీపురం బ్రాంచ్ జూనియర్ మేనేజర్ కృష్ణప్రసాద్‌ను కూడా బదిలీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డివిజన్లలో, బ్రాంచ్‌ల్లో అధికారులు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, సేల్స్‌మాన్ ల బదిలీలు జరిగాయి. తాము కోరుకున్న స్థానాల కోసం, కోరుకున్న ప్రాంతాల కోసం కొంతమంది అధికారులు, ఉద్యోగులు దండిగా ముడుపులు సమర్పించుకున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

ఉపాధి పనులు వేగవంతం కావాలి : పిఒ

పార్వతీపురం: ఐటిడిఎ పరిధిలో చేపట్టే ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని పిఒ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. సోమవారం తన ఛాంబరులో డ్వామా సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధి హామీలో ఉద్యానవన మొక్కల పెంపకం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. సమావేశంలో ఎపిడి సురేష్‌నాయుడు, 8 మండలాల ఎపిఒలు, ఇసిలు, జెఇలు, ఎంపిఒ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

21న డిఇఒ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి- పార్వతీపురం

ఈ నెల 21న ఉపాధ్యాయ సంఘాల సమితి ఆధ్వర్యాన ఉపాధ్యాయులు డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయనున్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకుల సూచనలు సలహాలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, ఇతర అంశాల విషయంలో ఏకపక్షంగా ఉత్తర్వులు జారీ చేయడానికి నిరసనగా యుటిఎఫ్, ఎపిటిఎఫ్, పిఆర్‌టియుతో పాటు అన్ని సంఘాలు పోరాటానికి సిద్ధమవుతున్నాయి.

పిఎం జన్‌మన్ గ్రౌండింగ్ బాగా జరగాలి

శ్యామలాంబ జాతరలో సమస్యలు తలెత్తరాదు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

పిఎం జన్ మన్ కింద నిర్మిస్తున్న గృహ నిర్మాణ పనులు మరింత వేగవంతం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు గ్రౌండింగ్ కాని గృహాలను వెంటనే గ్రౌండింగ్ చేయాలని, మొత్తంగా పిఎం జన్ మన్ పనులు జిల్లాలో బాగా జరగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సోమవారం తన కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాయోజిత కార్యక్రమాలైన పిఎం జన్ మన్, పిఎం సూర్య ఘర్ పథకాలు మరింత జోరుగా జరగాలని పేర్కొన్నారు. ఈ రెండు కార్యక్రమాలకు లబ్ధిదారులు ముందుకు వచ్చేలా అధికారులు చొరవ చూపాలని తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ చట్టంలో కొన్ని రహదారులను, పిఎంజిఎస్‌వై కింద కొన్ని రహదారులను మంజూరు చేశామన్నారు. వాటి పనులు వేగవంతం కావాలని, చెక్ డ్యామ్ పనులు మరింత పురోగతి సాధించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు వారి మండలాల్లోని అంగన్వాడీ కేంద్రాల సందర్శన, గ్రామాల్లోని సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడం, గృహ నిర్మాణాల లే అవుట్లను సందర్శించి స్థితిగతులను పరిశీలించడం, మొదటి బుధవారం రోజున అనిమియా యాక్షన్ కమిటీలో పాల్గొని రక్తహీనత నివారణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న ట్రాక్టర్లను, చెత్త వాహనాలను వినియోగించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సాలూరులో ప్రారంభమైన శ్యామలాంబ అమ్మవారి జాతర ఘనంగా జరగాలని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వరాదని కలెక్టర్ పేర్కొన్నారు. జాతర ముగిసే వరకు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగరాదని, అధికారులకు అప్పగించిన విధులను తూచ పాటించాలని తేల్చిచెప్పారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం విషయంలో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రతి కోర్టు పరిధిలో తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ డాక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, డిఆర్డిఎ పీడి ఎం.సుధారాణి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 4,215.30 కోట్లతో పిఎల్ క్రెడిట్ ప్లాన్ ఆమోదం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో రూ.4,215.30 కోట్లతో పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ (పిఎల్‌పి) 2025-26ను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ విడుదల చేశారు. నాబార్డ్ రూపొందించిన పిఎల్‌పి 2025-26 సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా పారిశ్రామిక ప్రమోషన్ కమిటీ సమావేశంలో విడుదల చేశారు. పిఎల్‌పి 2025-26లో జిల్లా క్రెడిట్ సామర్థ్యం, సమగ్ర గ్రామీణాభివృద్ధికి పెద్ద పీట వేశారు. ప్రాధాన్యతా రంగాలకు రుణాలు పెంచడం, మౌలిక సదుపాయాల అంతరాలను తగ్గించడం, స్థిరమైన - స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ఈ ప్రణాళికలో ప్రాధాన్యత ఇచ్చారు. జిల్లాలో ప్రధాన పంటలు వరి (0.75 లక్షల హెక్టార్లు), మొక్కజొన్న (0.11 లక్షల హెక్టార్లు), పత్తి (0.10 లక్షల హెక్టార్లు) ఉన్నాయి. మొత్తం రుణ సామర్థ్యం రూ.4,215.30 కోట్లు. ఇందులో మౌలిక సదుపాయాలు, అనుబంధ రంగాలకు రూ.3,316.04 కోట్లు, ఎంఎస్ఎంఇలకు రూ.386.69 కోట్లు, గృహనిర్మాణాలకు రూ. 221.40 కోట్లు, విద్యకు రూ.21.68 కోట్లు, ఎగుమతి క్రెడిట్ రూ.5.10 కోట్లు, పునరుత్పాదక ఇంధనానికి రూ.25.24 కోట్లు, సామాజిక మౌలిక సదుపాయాలకు రూ.107.24 కోట్లు, ఇతర రంగాలకు రూ.131.90 కోట్లు కేటాయించారు. ఈ ప్రణాళికలో రంగాలవారీ క్రెడిట్ విభజనలో పంట రుణాలకు రూ.2,379.50 కోట్లు, అనుబంధ కార్యకలాపాలకు టర్మ్ రుణాలకు రూ.937.54 కోట్లు, వ్యవసాయ మౌళిక సదుపాయాలకు రూ.179.43 కోట్లు, వ్యవసాయ-అనుబంధ కార్యకలాపాలకు రూ.88.10 కోట్లు కేటాయించారు.

అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ జిల్లాలో వివిధ రంగాల్లో సామర్థ్యాన్ని పెంచడానికి సహాయపడుతుందన్నారు. ఎఫ్‌పిఒలను ప్రోత్సహించడం, ఏడాది పొడవునా ఆదాయం కోసం స్థిరమైన వ్యవసాయం, స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబుల్ గ్రూప్‌లను బలోపేతం చేయడం, పంటల తర్వాత మౌలిక సదుపాయాలు, పిఎం, ఎఫ్ఎంఇ, పిఎంఇజిపి, పిఎం విశ్వకర్మ ద్వారా గ్రామీణ సంస్థలను ప్రోత్సహించడం వంటి వాటిని ప్రాధాన్యత కలిగిన రంగాలుగా తీసుకున్నామని ఆయన అన్నారు.

పిఎల్‌పి 2025-26ను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, అధికారులు

ఎంఎస్ఎంఇ పార్కులపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గ పరిధిలో ఒక ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీచేసిన సంగతిని గుర్తుచేశారు. అందులో భాగంగా పాలకొండలో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, త్వరలో పార్వతీపురంలో ఏర్పాటు చేసుకోబోతున్నామని అన్నారు. మిగిలిన సాలూరు, కురుపాం నియోజక వర్గాల్లో స్థలాలు గుర్తించినప్పటికీ, ప్రారంభించుకోవాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన స్థితిని సమీక్షిస్తూ శిక్షణ పొందిన లబ్ధిదారుల డేటాను వేరు చేసి సంబంధిత ఎంపిడిఒ, ఎపిఎం, క్లస్టర్ కోఆర్డినేటర్లు, సంక్షేమ సహాయకులకు తెలియజేయాలని ఆదేశించారు.ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి ఈ నెల 15 వరకు 97 దరఖాస్తులను స్వీకరించామని, వీటిలో 90 దరఖాస్తులకు ఆమోదం తెలిపినట్లు పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ కలెక్టరుకు వివరించారు. పిఎం విశ్వకర్మ కింద జిల్లావ్యాప్తంగా 25,493 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 1,253 మందికి శిక్షణ ఇచ్చామని, 76 మందికి రుణాలు మంజూరు చేశామన్నారు. మిగిలినవి వివిధ స్థాయి పరిశీలనల్లో ఉన్నాయన్నారు. సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి కరుణాకర్, ఎడి పి.సీతారాము, రామకృష్ణ, ఐపిఒ కిరణ్, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కర రావు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎన్.విజయ్ స్వరూప్, నాబార్డ్ ఏజీఎం దినేష్, డిపిఒ టి.కొండలరావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు వారాల్లో చెక్ డ్యాముల పనులు పూర్తి

జిల్లాలో ఉపాధిహామీ చట్టం కింద చేపడుతున్న చెక్ డ్యాములు, క్యాస్కేడింగ్స్, చెరువుల పనులు ఆరు వారాల్లో పూర్తికావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఛాంబరులో జిల్లాలో చేపట్టిన జల వనరుల పనులపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 39 చెక్ డ్యాములు, 122 చెరువులు, 40 క్యాస్కేడింగ్స్ పనులను చేపట్టేందుకు మంజూరు ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. త్వరలో ఆ పనులను పూర్తిచేయాలని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీలో జిల్లాకు కేటాయించిన రూ.210 కోట్ల నిధుల్లో ప్రప్రథమంగా జల వనరుల పనులకే తొలి ప్రాధాన్యత ఇచ్చామని, తద్వారా రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల్లో ఒక్క పని కూడా ప్రారంభం కాలేదని, దీనిపై ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఇరిగేషన్ ఇఇ ఆర్.అప్పల నాయుడు, డిఇలు, ఎఇఇలు పాల్గొన్నారు.

గిరిజనులకు ఉద్యోగాలు కల్పించాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఈ నెల 20న జరగబోవు రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ సమావేశంలో జీవోల ప్రకటించిన మెగా డిఎస్‌సి -2025 నోటిఫికేషన్‌లో షెడ్యూల్ ఏరియా ఆదివాసీల పోస్టులు మినహాయించి నోటిఫికేషన్ విడుదల చేయాలని సీతంపేట ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు బిడ్డిక శ్రీనివాసరావు, కార్యదర్శులు బిడ్డిక ఉమామహేశ్వరరావు, కొంగొర భాస్కరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకు శతశాతం ఉద్యోగ కల్పన చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం సీతంపేట ఐటిడిఎ ఆఫీసులో సమావేశం నిర్వహించారు. ఆదివాసీలకు ఈ నోటిఫికేషన్‌లో మినహాయించి ఆదివాసీలకు ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. దీని కోసం ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో శాంతియుత భారీ ర్యాలీ కార్యక్రమాన్ని ఈ నెల 27న చేపట్టేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ శాంతి యుత ర్యాలీకి డిఎస్‌సి అభ్యర్థులు, కాంట్రాక్టు ఉపాధ్యాయులు, భాష వాలంటీర్లు, ఉద్యోగ, నిరుద్యోగ, ఉపాధ్యాయ, అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు కలిసి రావాలని కోరారు. ఈ సమావేశంలో గిరిజన సంఘ నాయకులు ఎం తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - కురుపాం

పెరుగుతున్న ఎండలు తదారుతున్న గొంతులు దాహం తీరే దారి లేక ప్రజలు అవస్థలు అనే శీర్షికతో సోమవారం ప్రజాశక్తి పత్రికలో వెలువడిన కథనానికి ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి స్పందించి ఎంపిడిఒ కార్యాలయం వద్ద మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాలు, ఆర్‌బికె కేంద్రాలకు వివిధ పనుల నిమిత్తం వస్తున్న ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు తమ సిబ్బందికి అన్ని సచివాలయాల్లో, ఆర్‌బికె కేంద్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు.

కార్యాలయంలో ఏర్పాటు చేసిన తాగునీటి క్యాన్

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పార్వతీపురం మన్యం జిల్లాలో పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు జిల్లా వ్యాప్తంగా ఏడు కేంద్రాలలో జరిగిన తెలుగు పరీక్షకు 154 మంది విద్యార్థులకు గాను 89 మంది విద్యార్థులు హాజరు కాగా 65 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి రమాజ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ఆమె తెలిపారు.

మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ప్రసాద్

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గుచ్చిమి గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల మస్తరులను వెరిఫికేషన్ చేసి వారి పేర్లను చదివారు. ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణేత సమయంలో వేతనదారులు పనిచేయాలని పనిచేస్తే కూలి కిట్టుబాటు అవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ వడదెబ్బకు గురికాకుండా ఉండాలని పనులు చేసే ప్రదేశాలలో టెంట్లు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మజ్జిగను సరఫరా చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీ పురం

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గుమ్మ లక్ష్మీపురంలో సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. వేసవి దృష్ట్యా ఈ మజ్జిగ చలివేంద్రం ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్పర్సన్ కడ్రక కళావతి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, బిజెపి మండల కన్వీనర్ పెద్దింటి దివాకర్, నాయకులు వెంపటాపు భారతి, భూషణ్, దొరబాబు, అప్పలస్వామి, భాస్కర్ రావు, ప్రసాద్, గౌతమ్, రామారావు, రాజేష్, చిన్న, మన్మధ, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తున్న ఎంఇఒ కోటిబాబు

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - సీతంపేట

పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన సామరెల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలను పిఎంఆర్‌సి ఎడ్యుకేషన్ ఎంఇఒ పి.కోటిబాబు సోమవారం ప్రశంసా పత్రాలు, నగదు అందజేశారు.. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సంపాదించిన సంజన, కావ్యశ్రీ, లక్ష్మిలకు, తల్లిదండ్రులకు పురస్కారంతో నగదు పురస్కారంతో కోటిబాబు సత్కరించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.భాస్కరరావు, కె.భాస్కరరావు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్యామలాంబను దర్శించుకున్న డివిజి దంపతులు

ప్రజాశక్తి- సాలూరు

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు దంపతులు సోమవారం స్థానిక శ్యామలాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి వారిచేత సాంప్రదాయ బద్దంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలం తర్వాత శ్యామలాంబని దర్శించుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు.

సుందరయ్య జీవితం ఆదర్శ ప్రాయం

ప్రజాశక్తి - సాలూరురూరల్

సమాజం కోసం జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు పుచ్చలపల్లి సుందరయ్య అని, ఆయన జీవితం ఆదర్శప్రాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు కొనియాడారు. సుందరయ్య వర్ధంతి సభ పట్టణంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి విధానం ఏవిధంగా ఉంటే రైతాంగానికి మేలు జరుగుతుందో అనేక విలువైన సూచనలు చేశారని, దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ, సిపిఎం ఎదుగుదలకు అగ్రగామి నాయకులు సుందరయ్య. నిలిచారని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో నడిచి ప్రజా జీవితంలో ప్రజా సమస్యలపై పోరాడేందుకు ఆశయ సాధనకు మనమంతా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు శంకర్రావు, లింగరాజు. రాముడు, లక్ష్మి, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : సుందరయ్య వర్ధంతి సభ కొమరాడ, కుమ్మరకుంట పంచాయతీ డంగ భద్ర లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

సాలూరు : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

వాడవాడలా పుచ్చలపల్లి వర్ధంతి వేడుకలు

బలిజిపేట: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

బలిజిపేట : స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభ బద్దాన భానుమూర్తి అధ్యక్షతన జరిగింది. సుందరయ్య చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు మాట్లాడుతూ ప్రజా, సామాజిక సమస్యలను నిర్దిష్టంగా పరిశీలించి ప్రజా ఉద్యమాలను నిర్మించిన మహెూన్నతమైన వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. సుందరయ్య ఆలోచన, ఆశయ సాధనకై ఆయన ఆదర్శాలతో ప్రజా ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిఎస్ వెంకటమరణ, నల్ల ఈశ్వరరావు, గంట్యాడ బలరామనాయుడు, ఆవు సాంబమూర్తి, సత్యం, గౌరీశ్వరరావు, జె.వెంకటరమణ, ఎ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : సుందరయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దావాలా రమణారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో దావాల రమణారావు మాట్లాడుతూ సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాద రాము, దూసి దుర్గారావు, ఎ.భానుచంద్రరావు, సిఐటియు కార్యకర్తలు సిహెచ్ సంజీవి, పి.వేణు, స్థానిక అడ్వకేట్ పి.పద్మలత తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని చినబోగిలి, పెదబోగిలి, గుడ్డిపేట, బూర్జ గ్రామాల్లో సుందరయ్య 40 వర్ధంతిని ఆయా గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నిర్మాతలో ఒకరైన సుందరయ్య పేద, పీడిత వర్గాల కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. ఆయన ఆశయాలకు భవిష్యత్తులో జరగబోయే పోరాటాలే ఘనమైన నివాళ్లు ఆయన అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, బి.అప్పారావు, సిహెచ్.కృష్ణారావు, ఎం.సింహాచలంతో పాటు పలువురు పాల్గొన్నారు.

పాచిపెంట : పుచ్చలపల్లి సుందరయ్య 40 వర్ధంతి సభ స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించారు. ముందుగా సిపిఎం మండల నాయకులు జన్ని రామయ్య, కార్మిక సంఘాల నాయకులు లెంక గోవింద, రైతుసంఘం నాయకులు పి అప్పారావు, ఆటో కార్మిక సంఘం నాయకులు పి రంజిత్ కుమార్, బడ్నాన సురేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన సుందరయ్య భారత దేశ విముక్తికి మార్గం చూపారన్నారు.

సీతానగరం: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఏడాదిలోనే ఎమ్మెల్యే స్వరూపం బట్టబయలు

మాజీ ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రతిపక్షానికి పని లేకుండానే పార్వతీపురం నిజస్వరూపం నియోజకవర్గ ప్రజలు గ్రహించారని, అందుకు ఆయన అవినీతి, అక్రమాలపై ఏడాదిలోగానే జరుగుతున్న చర్చే నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు విమర్శించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తూ ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పనితీరుపై ఏడాది పాటు ఏమీ అనకుండా ఉన్నానని, ఆయనపై ఎడతెరిపి లేకుండా వస్తున్న ఆరోపణలపై స్పందించలేదని, ఈలోగానే ఎమ్మెల్యే నిజస్వరూపం ప్రజల ముందు బట్టబయలు అయిందని ఆయన అన్నారు. ఒక మహిళా తహశీల్దారుపై రికార్డులు టెంపరింగ్ చేయమని మూడు నెలలుగా వేధిస్తూ, అందుకు ఆమె అంగీకరించకపోతే రాత్రి పూట మహిళ అని చూడకుండా ఫోన్లో అసభ్యంగా దూషించడమే కాకుండా, ఆమెపై అవినీతి ముద్ర వేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. గతంలో బడిదేవరకొండ మైనింగ్ విషయంలో మేనేజ్మెంట్‌కు అనుకూలంగా వ్యవహరించమని ఒత్తిడి తీసుకొస్తే ఆమె ఎమ్మెల్యే వేధింపులు తట్టుకోలేక మూడు నెలల పాటు సెలవుపై వెళ్లడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రేషన్ డీలర్, అంగన్వాడీ ఉద్యోగాలు అమ్ముకున్నారని ఎమ్మెల్యేపై పత్రికల్లో వార్తలు రాలేదా, సదరు అవినీతి నిజం కాదా అని అన్నారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా సెటిల్మెంట్లు, దందాలు, ఆక్రమణలు ఎక్కువయ్యాయని తెలుగు తమ్ముళ్లు, కార్యకర్తలు బాధపడడం అందరికీ తెలుసని అన్నారు. డబ్బులు తీసుకొని మున్సిపల్ ఉద్యోగులను బదిలీపై తీసుకు రావడం అందరికీ తెలుసని, ముగ్గురు మహిళలు టిడిపి ఎమ్మెల్యే విజయచంద్రపై పోలీస్ కేసులు వేసిన మాట వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. గోకులం కేటాయింపుల్లో మామ్మళ్లు వసూలు చేశారని ఆరోపించారు. ఉపాధి హామీ పనుల్లో లంచం డిమాండ్ చేస్తున్నట్లు పత్రికల్లో రోజూ వస్తున్న వార్తల్లో వాస్తవంలేదానని ప్రశ్నించారు. అవినీతి రహితుడినని కబుర్లు చెబుతున్న ఎమ్మెల్యే లంచాలు తీసుకోపోతే ఇప్పుడు వాడుతున్న ఫార్చ్యూనర్ కారు, ఎక్స్‌యువి 700 కారు, విజయనగరంలోని అపార్ట్మెంట్ ఎలా వచ్చాయనేది ప్రజలకు వివరించాలని కోరారు. ఎమ్మెల్యేగా ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, వారికి ఉపయోగపడేలా పనిచేసే వారి మన్నలను పొందాలని, అంతేకానీ అబద్ధాలు ప్రచారం చేస్తూ, అలవి కాని హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి పరిపాలన సాగిస్తే నాలుగేళ్ళ గడవకముందే జనాలు తిరగబడి ఇంటికి పంపిస్తారని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, జడ్పీటీసీ బలగ రేవతమ్మ, పార్వతీపురం, సీతానగరం ఎంపిపిలు, వార్డు కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు సమస్యలు నిల్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించినప్పటికీ ఏ ఒక్కరి నుండి ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ ఎఒ డి. వెంకటరమణ, గృహ నిర్మాణ శాఖ జెఇ వి.వినోద్ కుమార్, ఎపిఒ జి. సత్యంనాయుడు, ఎపిఎం కె.రాము, విద్యుత్ శాఖ ఎఇ నవీన్ కుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు జ్ఞానమ్మ, రాజేశ్వరిలు పాల్గొన్నారు

అర్థం లేని విమర్శలు మానుకోండి

అభివృద్ధి చూసి పార్టీలో చేరామన్న ఎంపిపి భాను గ్రూపు

ప్రజాశక్తి - పాలకొండ

తమపై వైసిపి నాయకులు చేసిన విమర్శలు అర్థం లేదని, వైసిపిలో తమకు గుర్తింపు లేక, స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ చేస్తున్న అభివృద్ధి చూసే వైసిపిని వీడి కూటమిలో చేరామని ఎంపిపి బొమ్మల భాను, వాకముడి అనిల్, నగర పంచాయతీ చైర్పర్సన్ ప్రతినిధి ఆకుల కుమార్, కౌన్సిలర్లు కొంచాడ అరుణ కుమార్, గంగు నాయుడు, ఎంపిటిసి ప్రతినిధులు మజ్జి నవీన్, నిమ్మక ప్రసాదు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాము పదవులకు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామని, అయితే మీరు కూడా వచ్చి రాజీనామా చేస్తే ప్రజా క్షేత్రంలో తేల్చుకుందామని అన్నారు. వైసీపీలో రూ.కోటీ 2 లక్షలు నిధులు ఇచ్చామని చెప్పడం దారుణమని కౌన్సిలర్ గంగునాయుడు అన్నారు. కేంద్ర నిధులు వార్డుకు కేటాయించడం జరిగిందన్నారు ఎంపిపి, వైస్ ఎంపీలు మాట్లాడుతూ తమకు వైసీపీలో ఏనాడూ గౌరవించలేదన్నారు. మరో వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాష్ పెత్తనం చెలాయించే వారిని ఆరోపించారు. తమను సభ్యులుగా కూడా గుర్తించే పరిస్థితి లేదన్నారు. అలాంటివారు తమపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. చైర్‌పర్సన్ ప్రతినిధి ఆకుల కుమార్ మాట్లాడుతూ తన వార్డుకు ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదని, రూ.34 లక్షల నిధులు కేటాయించినట్లు వైసిపి నాయకులు ప్రకటించడం విడ్డూరంగా ఉందని అన్నారు. కౌన్సిలర్ కొంచాడ అరుణ్ కుమార్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం హయాంలో నగర పంచాయతీకి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కొంత ఒక్క రూపాయి కూడా నిధులు తేలేకపోయారన్నారు. అవగాహన లేని వారితో మాట్లాడించడం సరికాదు. రాజకీయాలపై పూర్తి అవగాహన లేని వారితో మాట్లాడించడం వైసిపి పెద్దలకు సరికాదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు అన్నారు. ఎమ్మెల్సీ స్వార్థంతో రాజకీయం చేయడం వల్ల స్థానిక పదవుల్లో ఉన్న అందరూ విసిగి ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి కూటంలో చేరారని అన్నారు. మండల పరిషత్ సమావేశాలకు ఎమ్మెల్సీ వెళ్లడంలేదడం ఆయన మనస్సాక్షికే తెలియాలన్నారు. జీవోలు పూర్తి అవగాహన ఉన్న వ్యక్తి ఇలా మభ్యపెట్టి మాట్లాడించడం సరిపోదన్నారు. పట్టణ జనసేన అధ్యక్షులు కొండదాడి రాజేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.100 కోట్లు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అభివృద్ధికి ఇది నిదర్శనం కాదా అంటూ ప్రశ్నించారు. టిడిపి మండల నాయకులు జాడ శ్రీధర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ప్రోటోకాల్ వివాదంపై రాద్ధాంతం చేస్తున్న వ్యక్తులు జీవోలపై అవగాహన చేసుకోవాలన్నారు. వాస్తవ పరిస్థితులు తెలుసుకొని మాట్లాడాలన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గ్రామపంచాయతీ మెయిన్ రోడ్డు వద్ద గ్రామ సేవాదళ్ బోటు లక్ష్మీనారాయణ ప్రోత్సాహంతో, కోరాడ మన్మధ సహకారంతో గ్రామస్తులు పెద్దలు గుమ్మడి శశిదేవి, కొనిస సూర్యప్రకాశరావు, కొమ్మనబిల్లి గౌరీశంకర్రావు, యుగంధర్ ప్రిన్సిపల్ ఆర్థిక సాయంతో ప్రజల దాహం తీర్చే చలివేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ బి గౌరీ శంకర్రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రేమానందం, ఉప సర్పంచ్ కిషోర్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఒకేరోజు రెండు చోట్ల చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టిడ్కో ఇళ్లు అప్పగించండి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

గత ఎనిమిదేళ్లుగా ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు టిట్కో ఇల్లు అప్పగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఒబిసి జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, మండల అధ్యక్షులు తీళ్ళ గౌరీ శంకరరావు తదితరులు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్‌ను కలిసి టిడ్కో గృహాల సమస్యలపై చర్చించారు. 2017లో అధికారంలో ఉన్న టిడిపి ప్రవేశపెట్టిన టిడ్కో గృహాలు ఇప్పటి వరకు లబ్ధిదారులకు చేరలేదన్నారు. అప్పటి టిడిపి, తర్వాత వచ్చిన వైసిపి, ఇప్పటి కూటమి పాలకులు టిడ్కో గృహాల విషయంలో విఫలమయ్యారని ఆరోపించారు. సొంతింటి కల నెరవేరుతుందన్న ఆశతో ఉన్న పార్వతీపురం, సాలూరు లబ్ధిదారులకు సొంతింటి కల నెరవేర్చాలన్నారు. పార్వతీపురానికి 1104, సాలూరుకు 1440 టిడ్కో గృహాలను మంజూరు చేశారన్నారు. వాటికోసం లబ్ధిదారుల నుండి కొంత మొత్తం డీడీలు రూపంలో వసూలు చేశారని ఆరోపించారు. తక్షణమే టిడ్కో గృహాలు విషయంపై దృష్టి సారించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని అందజేశారు. దీనికి స్పందించిన సబ్ కలెక్టర్ తక్షణమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు సబ్ కలెక్టర్‌ను కోరారు.

సమస్యలను సబ్ కలెక్టర్‌కు వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రతి గ్రామానికీ పక్కా రహదారి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి గ్రామానికి పక్కా రహదారి, విద్య, వైద్యం మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని గుజ్జువాయి నుండి డేరింగ్‌పాడు వరకు రూ.2.8 కోట్లు నిధులతో మంజూరైన నూతన బిటి రహదారి నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్య, వైద్యం, రహదారి, గిరిశిఖర గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతులకు ప్రజలకు ఎక్కడా ఇబ్బంది పడకుండా ఐదేళ్లలో శత శాతం అన్ని గ్రామాలను అభివృద్ధి పర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. దీనికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా గ్రామాలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు, ఎఎంసి చైర్పర్సన్ కడ్రక కళావతి, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, మండల కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్‌కుమార్, టిడిపి నాయకులు వెంపటాపు భారతి, రంజిత్ కుమార్ నాయకో, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

మండలంలో మొండెంఖల్‌కు చెందిన టిడిపి కార్యకర్త గౌడు అర్జున్ గౌడు త్రినాథ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జగదీశ్వరి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పొలాలకు రహదారి కల్పించండి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

చె ం వ గట్టును వెడల్పు చేసి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ నర్సిపురం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపిపి గొట్టాపు గౌరీ రమణ ఆధ్వర్యంలో రైతులు సోమవారం పార్వతీపురం ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్‌కు వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన మాలగుండం చెరువు రైల్వే మూడవ లైను పనుల కోసం కొంత భాగం పూడ్చి వేయడంతో రహదారి లేక ఎగువ వైపు 200 ఎకరాల ఆయకట్టు రైతులు తమ పంటను ఇళ్లకు తీసుకురావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతానికి ఉన్న మాల గుండం చెరువు రహదారిని వెడల్పు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పక్కా రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు.

వినతి పత్రాన్ని అందిస్తున్న రైతులు, నాయకులు

వసతి గృహాన్ని పరిశీలిస్తున్న మెజిస్ట్రేట్ సౌమ్య

హాస్టళ్లను పరిశీలించిన మెజిస్ట్రేట్

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జోసెఫ్ సోమవారం మండల కేంద్రంలో గల ఎపిఆర్‌జెసి, మహాత్మ జ్యోతిబాపూలే, కస్తూరిబా, ఆదర్శ పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, బీసీ, ఎస్‌సి హస్టలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులకు అందుతున్న సేవలు, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ఆమె మాట్లాడుతూ పాఠశాలలు పున ప్రారంభం జరిగే సరికి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్టు, పాఠశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

22ఎ జాబితా నుంచి తొలగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

బలిజిపేట మండలం వెంగాపురం గ్రామానికి చెందిన కొన్ని ప్రాంతాల్లో భూములు 22 ఎ జాబితా నుండి తొలగించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జెసి శోభికకు గ్రామస్తులు ఎంపిటిసి గుల్లిపల్లి మురళి ఆధ్వర్యంలో వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదలకు చెందిన భూములు 22ఎ జాబితాలో పొరపాటున నమోదు కావడంతో రైతులు భూములు అమ్ముకోవడానికి గాని అభివృద్ధి చేసుకోవడానికి గానీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే వాటిని జాబితా నుంచి తొలగించాలని జెసిని కోరినట్లు వారు తెలిపారు. జెసి స్పందించి సమస్యపై విచారణ జరిపి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు జి వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహాదేవివలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి సచివాలయం పరిధి మహాదేవి వలసలో సోమవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.